క్లుప్తంగా

సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కోదాడరూరల్ : సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే క్రీడా పోటీలకు కోదాడ స్టూడెంట్స్ కోఫోకాన్ కరాటే క్లబ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కోఫోకాన్ తెలంగాణ ఆరె మాధవిలత శుక్రవారం తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ క్లబ్‌కు చెందిన ఎస్.దీపిక, కె.పల్లవి, ఎస్.మేఘన, క్యాతిశ్రీ పలు విభాగాల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్నేహితులు, పట్టణప్రజలు అభినందించారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణం నుంచి ఫణిగిరి గుట్ట వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించేందుకు శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని రాజీవ్‌చౌక్ నుంచి ఐటీఐ కళాశాల, ఫణిగిరి గుట్ట మీదకు నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ నిధులపై ఆడిట్

మేళ్లచెరువు : మేళ్లచెరువు గ్రామ పంచాయతీలో 2023– 24 సంవత్సరానికి గాను జమ– ఖర్చులపై శుక్రవారం అధికారులు ఆడిట్ నిర్వహించారు. గత సంవత్సరం సర్పంచ్ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో స్వాధీనం చేసుకుని ఆర్‌డీఓ కార్యాలయంలో ఉంచిన గ్రామ పంచాయతీ రికార్డులను ఈ సందర్భంగా అసిస్టెంట్ ఆడిట్ అధికారి వీరారెడ్డి, సీనియర్ ఆడిట్ అధికారి శ్రీనివాస్, జూనియర్ ఆడిట్ అధికారి ప్రశాంత్ తనిఖీ చేశారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : యోగా, ధ్యానంను ప్రతిఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ప్రిసెప్టర్ (యోగా గురువు) పి.రామారావు, ఆయుష్ డిపార్టుమెంట్ యోగా శిక్షకుడు బి.రామాంజిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని బృందావనంలో మూడు రోజుల యోగా శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. యోగాతో అన్ని సమస్యలు దూరం అవుతాయని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

జాలీ ఫోనిక్స్ పద్ధతిపై పట్టు సాధించాలి



విద్యార్థులతో జిల్లా మానిటరింగ్ అధికారి జనార్దన్, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్‌రూరల్ : ఆంగ్ల భాష అభ్యసనకు గాను జాలి ఫోనిక్స్ పద్ధతిపై విద్యార్థులు పట్టు సాధించాలని జిల్లా మానిటరింగ్ అధికారి జనార్దన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బూరుగడ్డలో గల ప్రాథమిక పాఠశాలలో జాలి ఫోనిక్స్ అమలు విధానాన్ని ఎంఈఓ భూక్యా సైదానాయక్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులలో ఆంగ్ల భాష అభ్యసన మెరుగు, ఉపాధ్యాయుల పనితీరు, ఆకర్షణీయమైన తరగతి గదిని చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బీరెల్లి శ్రీనివాసరెడ్డి, హెచ్ఎంలు నలబోలు శ్రీనివాసరెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఓయూ జేఏసీ నాయకుడు సోమగాని నరేందర్‌గౌడ్, ప్రజా కళాకారుడు బాదే నరసయ్య కోరారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాల పేర్లు కూడా ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌లో పొందుపరిచారని, అలాంటి కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయవద్దన్నారు. పందిరి ఎల్లారెడ్డి, దార మనోహర్ పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో బాలల ప్రతిభ



కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి విద్యా నిలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. ఎనిమిది ఎగ్జిబిట్లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వాటిలో కొన్ని ఎగ్జిబిట్ల వివరాలు -కోదాడ

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి

సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల (నాచురల్ ఫార్మింగ్) విభాగంలో అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రేణుక, చందనలు గైడ్ టీచర్ ఎస్. వెంకటేశ్వర్లు సూచనలతో తయారు చేసిన మోడల్ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. హైడ్రోఫోనిక్స్ (జలవర్ధనం) మృత్తిక లేకుండా మొక్కలను పోషకద్రావణంలో పెంచడం ద్వార ఇంట్లోకి కావల్సిన కూరగాయలు, పుష్పాలను ఇచ్చే మొక్కలను పెంచుకోవచ్చు. తక్కువ నీటిని ఉపయోగించి ఎక్కువ సాగు చేయడానికి బాటిల్ ద్వారా మొక్కల వేర్లకు నీటిని చిన్న పైపుల ద్వారా అందించి దిగుబడులు సాధించవచ్చు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చు.

చెట్ల ఎత్తును సులువుగా తెలుసుకోవచ్చు



జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో గణిత మోడల్ విభాగంలో కోదాడలోని జయ పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన క్లెనోమీటర్ ప్రాజెక్ట్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు నొషియా, మాన్యలు గైడ్ టీచర్ రాజు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ తయారు చేశారు. దీన్ని ఉపయోగించి దూరంగా ఉన్న చెట్ల ఎత్తును, బహుళ అంతస్తుల భవనాల ఎత్తును సులువుగా తెలుసుకోవచ్చని విద్యార్థులు చెపుతున్నారు. గణితశాస్త్రంలో ఉపయోగించే కొన్ని ఫార్ములాల ఆధారంగా ఈ పరికరాన్ని తయారు చేశామని చెబుతున్నారు. పెద్దగా ఖర్చు లేకుండా చిన్న అట్టముక్కల సాయంతో దీన్ని వీరు తయారు చేయడం గమనించదగ్గ విషయం.

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతి



సీఐ చరమందరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం సీఐ చరమందరాజుకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. మిర్యాలగూడ, కోదాడ వైపే కాకుండా మట్టపల్లి బ్రిడ్జి గుండా ఆంధ్ర ప్రాంతానికి రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ పెరిగిందని తెలిపారు.. పట్టణంలోని ప్రధాన కూడలి అడ్డరోడ్డులో సిగ్నల్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై స్పందించిన సీఐ.. సిగ్నల్ లైట్లు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుగ్గి బ్రహ్మం, పి.హుస్సేన్, శీలం శ్రీను, యోన, మురళి, వీరమల్లు, సోమయ్య, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకన్న, కిషోర్‌కుమార్, వేణు పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి



మునగాల : మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండలంలోని అమరవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ కాశీం, సీఐటీయూ నాయకులు కందుల వీరస్వామి, వెంకయ్య, సైదులు, నాగేంద్రబాబు, గోపి, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

నడిగూడెం : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్, ఉపాధ్యక్షుడు దున్నా శ్రీను, టీడీపీ మండల కార్యదర్శి బూరు గడ్డ థామస్, నాయకులు షేక్.లతీఫ్‌బాబు, దున్నా లింగయ్య, పుట్టా అంజయ్య, శ్రీరామ్, నరేష్, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం

మునగాల : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడినందుకు నిరసనగా శుక్రవారం మునగాల మండలంలోని నేలమర్రిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు, అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



నడిగూడెంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు సరికాదు



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు నవీన్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : రాజకీయ కక్షతో ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమరవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎదుర్కొలేక అక్రమ కేసులు పెట్టిస్తే అవి న్యాయస్థానాల్లో నిలబడవన్నారు. ఫార్ములా ఈ కారు రేసు కేసు రాజకీయ కుట్రలో భాగమేనని అన్నారు. అయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కుట్ర పూరితంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు

నేరేడుచర్ల : కాంగ్రెస్ పార్టీ కుట్ర పూరితంగానే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టిందని, ఈ అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీ బయపడదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు, నిరుద్యోగులు, రైతులు, ఐటీ ఉద్యోగులు కేటీఆర్‌కు అండగా ఉన్నారని అన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పిచ్చిరెడ్డి, పల్లెపంగు నాగరాజు, ఇంజమూరి రాజేష్, హుస్సేన్, పాలగాని భరత్, నాగరాజు తదితరులు ఉన్నారు.

కళాకారులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న కళాకారులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని నాంపల్లిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రముఖ కళా సంస్థ శివాని ఆర్ట్స్ 15వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పౌరాణిక నాటక పోటీలలో హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రంగస్థల సంక్షేమ సంఘం కళాబృందం కళాకారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనకు ప్రతిభా పురస్కారం లభించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు. బహుమతులు పొందిన వారిలో దొంతగాని సత్యనారాయణ, వీరబాబు, భద్రాచలం, రామకృష్ణ, శ్రీను, కిషోర్, మణిదీప్, వినోద్, గోపి, మురళి, సుకన్య, అఖిల, శ్వేత, సుష్మ తదితరులు ఉన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు కృషిచేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నేరేడుచర్ల : మహిళా హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని నాగిని అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని శ్రీచైతన్య స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా 'బేటి సమ్మాన్–రెస్పెక్ట్ ద గర్ల్స్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, డీజీఎం సుధాకర్, ఆర్ఐ సుజిత, కోఆర్డినేటర్ నాగేందర్, నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ డి. సత్యనారాయణ, విజయ్‌కృష్ణ, కౌన్సిలర్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ కార్యదర్శిగా గోవిందరావు

హుజూర్‌నగర్ : బ్లాక్ కాంగ్రెస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ కమిటీ కార్యదర్శిగా పట్టణానికి చెందిన బొడ్డు గోవిందరావు నియమితులైనట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తనకు నియామకపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీతారాంపురంలో డీఎల్‌పీఓ విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీఓ

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినాష్‌రెడ్డి పలు అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లా ఉపేందర్‌తో పాటు పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డీఎల్‌పీఓ యాదగిరి గ్రామంలో విచారణ జరిపారు. అక్రమాలకు పాల్పడుతున్న కార్యదర్శిని ఇక్కడి నుంచి బదిలీ చేయాలని ఓ వర్గం, ఆయన ఎలాంటి అక్రమాలకు పాల్పడడం లేదని బదిలీ చేయొద్దని మరో వర్గం వారు డీఎల్‌పీఓ ఎదుటే వాగ్వాదం చేసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

గరిడేపల్లి: గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అనిత, అస్మిషా, వర్షితరెడ్డి, అశ్విని, దీక్షిత, దివ్య, లావణ్య, నేహ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను సందర్శించిన నాబార్డు ప్రతినిధులు



నాబార్డు సభ్యుడిని సన్మానిస్తున్న చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల రాయినిగూడెం పీఏసీఎస్ కార్యాలయాన్ని శుక్రవారం నాబార్డు సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాబార్డు సభ్యులు ఆదిత్యా నికం స్వప్నల్ మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా గ్రామీణ ప్రాంతాల రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలన్నారు. డీసీసీబీ మేనేజర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధికి జిల్లా నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నాబార్డు సభ్యులను, జిల్లా మేనేజర్‌ను చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల బ్రాంచ్ మేనేజర్ సతీష్, సీఈఓ నిడిగొండ కనకయ్య, కేశగాని వెంకటేశ్వర్లు, అంజయ్య, శ్రీనివాస్, హరీష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మునగాల : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సరిత సూచించారు. శుక్రవారం మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం నిషా ముక్త్ భారత్ అభియాన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అదేవిధంగా విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మునగాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజమాధురి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



చిలుకూరు : బేతవోలులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రజితారెడ్డి, ఎస్ఐ రాంబాబు



మేళ్లచెరువు : యర్రగట్టుతండాలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రజితారెడ్డి

మేళ్లచెరువు : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, గ్రామస్తులంతా కలిసి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. శుక్రవారం మేళ్లచెరువు మండలంలోని యర్రగట్టుతండా గ్రామంలో గ్రామస్తుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను స్థానిక ఎస్ఐ పరమేష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు, దొంగతనాలతో పాటు అసాంఘిక శక్తుల కదలికలను పసిగట్టడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిక్రి లక్ష్మా, ఉప సర్పంచ్ వీరారెడ్డి, వెంకటరెడ్డి, కానిస్టేబుల్ రామ్‌కుమార్‌నాయక్, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేతవోలులో సీసీ కెమెరాలు ప్రారంభం

చిలుకూరు : మండలంలోని బేతవోలులో గ్రామస్తుల సహకారంతో రూ.10 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. శుక్రవారం బేతవోలులో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయన్నారు. పలువురు గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎనిమిది లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమంలో రామకృష్ణ పాత్ర మరువలేనిది

- మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి



రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

గరిడేపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమంలో లింగబోయిన రామకృష్ణ పాత్ర మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన లింగబోయిన రామకృష్ణ కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, చిట్టిబాబునాయక్, వీరంరెడ్డి సుబ్బిరెడ్డి, పెండెం వీరయ్యగౌడ్, హేమ్లానాయక్, కడప ఇసాక్, ఎడవెల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ

గరిడేపల్లి : మండల కేంద్రంలోని సునంద రైస్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో రైస్ ఇండస్ట్రీస్ ఎండీ కస్తూరి అవినాస్, కస్తూరి ఆకాష్, కస్తూరి సునందం, కేవీవీ రవికుమార్, చిట్టిబాబు, కడియం వెంకట్‌రెడ్డి, వీరంరెడ్డి శంభిరెడ్డి, పెండెం వీరయ్య, హేమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కోదాడరూరల్ : మాతానగర్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు



నడిగూడెం : పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్, తదితరులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మాతానగర్‌లో రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జగ్గయ్యపేటకు చెందిన టీడీపీ నాయకులు శ్రీరామ్ చిన్నబాబు, జయరాములు పాల్గొని కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ సుందర్‌రావు, కౌన్సిలర్ షాబుద్దీన్, మామిడి రామారావు, గంధం పాండు, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో..

పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్‌గౌడ్ మాట్లాడారు. ఏసు ప్రభు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పడిశాల రఘు, పాస్టర్ రేవా ఎస్.పాల్, ముస్లిం పెద్దలు హమీద్ మౌలానా, గాంధీ, పూర్ణ, వెంకటనారాయణ, లక్ష్మణ్, నాగరాజు, మైమూద్, నజీర్, నరేష్ తదితరులు ఉన్నారు.

నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో..

నడిగూడెం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్, స్థానిక సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ పి.కెయిన్ సుధాకర్ దాసు, దున్నా శ్రీనివాస్, బెల్లంకొండ సత్యనారాయణ, నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



మేళ్లచెరువు : రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



హుజూర్‌నగర్ : శ్రీకృష్ణ, గోదాదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మేళ్లచెరువు : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీగోదా భూనీళా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయంలో ఐదవరోజు ప్రాతఃకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గోపూజ, నిత్యార్చన, తిరుప్పావై పాశుర విన్నపం నివేదన, మంగళ నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరగిరినాథుని రంగభట్టారాచార్యులు, తరుణ్ దత్తు, కొంకపాక రాధాకృష్ణమూర్తి, శర్మ, నక్క కొండారెడ్డి, ఈఓ శంభిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ, గోదాదేవికి పల్లకీ సేవ

హుజూర్‌నగర్ : పట్టణంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా టీచర్స్ కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలంలో శ్రీకృష్ణ, శ్రీగోదా, శ్రీరామానుజులకు పూలు, తులసి దళాలతో పూజలు చేశారు. టీటీడీ అళ్వార్ దివ్య ప్రబంధం ప్రాజెక్ట్ సారథ్యంలో ఎం.దామోదరాచార్యులు తిరుప్పావై ప్రవచనం చెప్పారు. మానవుడు మోక్షం పొందడానికి భగవత్ సేవ, కీర్తనము సులభ మార్గాలు అవుతాయని తెలిపారు. గోదాదేవి రచించిన తిరుప్పావైని మహిళలు శ్రావ్యంగా గానం చేశారు. శ్రీకృష్ణ స్వామిని, గోదాదేవి ఉత్సవమూర్తులను పల్లకీలో ఆలయ ప్రదక్షిణ గావించారు. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.